ప్రజాశక్తి

సోమవారం 14 అక్టోబరు, 2024

5

శ్రీకాకుళం

17న మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఈ నెల 17న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావాలన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు ఉన్న యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు ఆ రోజు ఉదయం పది గంటలకు కళాశాలలో నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఆధార్ కార్డు నకళ్ళు, బయోడేటా, ఫొటోలు తీసుకురావాలన్నారు. ఈ జాబ్‌మేళాకు 3 బహుళజాతి కంపెనీలు పాల్గొనున్నాయని అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు వినియోగించుకోవాలని తెలిపారు.

తుపానుకు నేలకొరిగిన కొబ్బరి చెట్లు (ఫైల్)

జిల్లాకు మణిహారమైన సుదీర్ఘ సముద్ర తీరం రైతుల గుండెల్లో 'అల'జడి రేపుతోంది. 1999లో సూపర్ సైక్లోన్ తో ప్రారంభమైన ఈ అలజడి 2018 తిత్లీతో తారాస్థాయికి చేరుకుంది. నెమ్మదిగా ప్రారంభమై తీవ్రస్థాయికి చేరుకుంటున్న ఈ 'అల'జడికి ఉద్యానవన పంటలు కుదేలై రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. మరోవైపు ఒడిశాలో తీరం దాటిన అత్యధిక తుపాన్లు ఇచ్ఛాపురం నియోజకవర్గం రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బతీశాయి. దీంతో అక్టోబరు నెలలో అల్పపీడనం ఏర్పడిందంటేనే రైతులు హడలిపోతున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం ఉప్పెనలా ముంచుకొస్తుందోనని నిద్రలేని రాత్రులు గడుపుతుంటారు.

అలజడి రేపుతోంది

- అక్టోబరు అంటే... హడలిపోతున్న రైతాంగం
- కోలుకోలేని దెబ్బతీసిన సూపర్ సైక్లోన్
- దాన్ని కొనసాగించిన ఫైలిన్, తిత్లీ

ప్రజాశక్తి- కవిటి

జిల్లాలో అధిక ప్రాంతం ఒడిశాకు ఆనుకుని ఉండడంతో తుపాను ఆ ప్రాంతంలో తాకినా దాని ప్రభావం జిల్లాపై స్పష్టంగా ఉండడంతో రైతులు భారీగా మూల్యం చెల్లించుకోవలసి వస్తోంది. దీంతో ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో అల్పపీడనం ఏర్పడిందంటేనే జిల్లా రైతాంగం గుండెల్లో రైళ్లు పరిగెడుతూ ఉంటాయి. ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని రైతులు ఆ సమయంలో నిద్రలేని రాత్రులు గడుపుతుంటారు.

సూపర్ సైక్లోన్...

1999లో ఒడిశాలో తీరం దాటిన సూపర్ సైక్లోన్ ఇచ్ఛాపురం నియోజకవర్గం ప్రజలకు కాళరాత్రిగా మారింది. సుమారు 150 కిలో మీటర్లకు పైగా వేగంతో వీచిన గాలులు వ్యవసాయ పంటలతో పాటు ఉద్యానవన పంటలు కోలుకోలేని దెబ్బ తీశాయి. కొన్ని వేల కొబ్బరి, జీడి చెట్లు నేలకొరిగాయి. అంతేకాకుండా అప్పటి వరకూ చీడపీడలు ఎరుగని ఉద్యానవన పంటలు పురుగులు, వ్యాధుల బారిన పడ్డాయి. వాస్తవానికి ఈ సూపర్ సైక్లోన్ నష్టం కేవలం ఒడిశాకే జరిగినట్టు కేంద్రం ప్రకటించినా దాని ప్రభావంతో ఇచ్ఛాపురం నియోజకవర్గం రైతాంగం పతనం ప్రారంభమైందనే చెప్పాలి. ఆ తరువాత 2013లో ఫైలిన్, 2014లో హుదూద్, 2018లో తిత్లీ తుపాన్లు రైతులకు కోలుకోలేని దెబ్బతీశాయి.

వరుస తుపాన్లతో అతలాకుతలం

ఫైలిన్, హుదూద్, తిత్లీ తుపాన్లతో ఉద్యానవన పంటలు అతలాకుతలమయ్యాయి. 2013లో వచ్చిన ఫైలిన్ తుపానుకు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉద్యానవన పంటలకు భారీ నష్టం వాటిల్లింది. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కిరణ్ కుమార్‌రెడ్డి స్వయంగా నష్టం పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా ఫలితం లేకపింది. ఇక 2014లో విశాఖపట్నం అల్లాడించిన హుదూద్ ప్రభావం ఇచ్ఛాపురం వరకు కనిపించింది. ఇక 2018 అక్టోబరు 13న జిల్లాలోని వజ్రపుకొత్తూరు మండలంలో తీరం దాటిన తిత్లీ తుపాను రైతులకు కన్నీటినే మిగిల్చింది.

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో సుమారు 12 లక్షలకు పైగా కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. 25 వేల ఎకరాల్లో జీడిపంట పూర్తిగా తుడుచుకుపెట్టుకుపోయింది. రెండు పంటలకు సంబంధించి సుమారు 70 వేల మంది రైతులు కోలుకోలేనిదెబ్బతిన్నారు. అయితే అప్పుడు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం వెంటనే నష్టనివారణ చర్యలు ప్రారంభించి, నెల రోజుల్లోనే రైతులకు పరిహారం అందించింది. కానీ, పరిహారం పంపిణీలో అవకతవకలు జరిగాయని, పలుకుబడి ఉపయోగించి చాలామంది అర్హతకు మించి లక్షల్లో పరిహారం పొందినట్టు ఆరోపణలు వచ్చాయి. ఇటువంటి పరిస్థితుల నడుమ చాలామంది చిన్న, సన్నకారు రైతులకు పరిహారం అందలేదు. కొన్ని సాంకేతిక కారణాల సాకుతో ఇప్పటికీ సుమారు 7 వేల మందికి పరిహారం అందలేదు. అదిగో.. ఇదుగో అన్నారే తప్ప రెండు ప్రభుత్వాలు మారినా వీరికి న్యాయం మాత్రం జరగలేదు.

వెంటాడుతున్న చీడ పీడలు

మరోవైపు గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయ రంగాన్ని చీడపీడలు వెంటాడుతూ రైతాంగాన్ని పీల్చి పిప్పి చేస్తున్నాయి. 1999 సూపర్ సైక్లోన్‌తో ప్రారంభమైన ఈ చీడపీడల బెడద ప్రస్తుతం తారాస్థాయికి చేరుకుంది. కొమ్ము పురుగు, రెక్కపురుగు, ఆకు తొలుచు పురుగు, కాండం పురుగు, ఎర్రనల్లి, నల్ల ముట్టు పురుగు, గ్యానో డేర్మా, రసం పీల్చే పురుగు, ఆకు పురుగు, తెల్లదోమ అంటూ వివిధ పేర్లతో, వివిధ రూపాల్లో కీటకాలు, చీడపీడలు రైతాంగాన్ని నిలువునా ముంచేస్తున్నాయి. దీంతో ఈ చీడపీడలను నివారించలేక తన పంటను తాను కాపాడలేక ప్రస్తుతం రైతు నిర్వేదంలో కూరుకుపోయాడు. అధిక మొత్తంలో చెల్లించి పురుగుమందులు కొంటున్నా, శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు పాటిస్తున్నా వీటి బెడద నుంచి మాత్రం తప్పించుకోలేకపోతున్నాడు. దీంతో ప్రస్తుతం కొత్త మొక్కలు తయారు చేసుకోలేక, ఉన్న వాటిని కాపాడుకోలేక సతమతమవుతున్నాడు. పాతికేళ్ల కిందట ఇటువంటి కీటకాలు, జబ్బులు తాను చూడలేదని వాతావరణంలో వచ్చిన మార్పులు, నిరంతరం వస్తున్న ప్రకృతి విపత్తులే వ్యాధులకు తీవ్రతకు కారణమని సరిపెట్టుకుంటున్నాడు.

పెరిగిన వలసలు.. తరిగిన కమతాలు

ఇటువంటి పరిస్థితుల్లో చేసిన అప్పులు తీర్చలేక ఉన్న భూమిని అమ్ముకుని కొందరు ఒడ్డుకు చేరుకుంటుంటే, మరికొందరు ఉపాధి కోసం వలస పోతున్నారు. ముఖ్యంగా ఓవైపు చేసిన అప్పులు, మరోవైపు పెరిగిన జీవన వ్యయం, తరిగిన ఆదాయంతో చిన్న, సన్నకారు రైతులు రియల్టర్లను ఆశ్రయిస్తుంటే పచ్చని తోటలు ఫ్లాట్లుగా మారి పచ్చదనం పోయి పర్యావరణం దెబ్బతింటోంది. కమతాలు కుదించుకుపోయి వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి. దీంతో కడలిలో అలజడులు చెలరేగి తరచుగా తుపానులు సంభవిస్తున్నాయి. మరోవైపు వాతావరణంలో వస్తున్న మార్పులతో అయితే అతివృష్టి లేకపోతే... అనావృష్టి తాండవిస్తోంది. గత మూడేళ్లుగా సరైన వర్షాలు లేక ఇచ్ఛాపురం నియోజకవర్గంలో భూగర్భ జలాలు అడుగంటాయి. ఉద్యానవన పంటలు దిగుబడి తగ్గి నాణ్యత కోల్పోయాయి. ఇటువంటి సమస్యల నడుమ ఉన్న కమతాలు సాగుచేయలేక కుటుంబాలను పెంచి పోషించలేక రైతన్నల జీవితాలు దయనీయస్థితిలో ఉన్నాయి. కూతురు పెళ్లి చేయాలంటే షావుకారి ఏ ముక్క రాయమంటాడో అని భయం, వ్యవ'సాయం' చేస్తున్న కొడుక్కి సంబంధం చూద్దామంటే సాఫ్ట్‌వేర్ ఎందుకు నేర్పించలేదంటారేమో ఆందోళన. పిల్లాడికి ఎల్‌కెజిలో చేర్పిద్దామంటే ఎన్ని వేలు అడుగుతారో అన్న అనుమానం. పాపకి పై చదువులు చెప్పిద్దామంటే ఎన్ని పైసలు అడుగుతారో అన్న ఆలోచనలతో రైతుల కుటుంబాలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నాయి. చాలా సందర్భాల్లో ఈ సమస్యలు తీవ్రమై రైతు ఆయుష్షునే బలితీసుకుంటున్నాయి. 'దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు' అన్న చందంగా పంట పండినా కడుపు నిండక, కమతం అమ్మనిదే కష్టం తీరదన్నట్టు ప్రస్తుతం రైతుల పరిస్థితి ఏర్పడింది.

సిద్ధమైన అంబేద్కర్ ఆడిటోరియం

నేడు మద్యం దుకాణాలకు లాటరీ

అంబేద్కర్ ఆడిటోరియంలో ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

జిల్లాలో మద్యం దుకాణాలను సోమవారం లాటరీ పద్ధతిలో దరఖాస్తుదార్లకు కేటాయించనున్నారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఉదయం 8 గంటల నుంచి ప్రక్రియ మొదలు కానుంది. జిల్లావ్యాప్తంగా 158 దుకాణాలకు గాను, 4670 దరఖాస్తులు వచ్చాయి. మద్యాన్ని ప్రయివేట్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం వెలువరించిన విధివిధానాలకు లోబడి ఈప్రక్రియ జరగనుంది. దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం తొలుత అక్టోబరు 9 తుది గడువు కాగా, ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 11 వరకు పొడిగించింది. 11న చేపట్టాల్సిన లాటరీ సోమవారానికి వాయిదా వేశారు. గడువు ముగిసే నాటికి 158 దుకాణాలకు గాను, 4670 దరకాస్తులు రాగా, వాటి ద్వారా భారీగానే ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చిపెట్టింది.

ఎక్సైజ్‌స్టేషన్ల వారీగా దరఖాస్తుల వివరాలు

జిల్లాలో 12 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లు ఉండగా, శ్రీకాకుళంలో అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. 32 దుకాణాలకు అత్యధికంగా 1065 దరఖాస్తులు వచ్చాయి. ఆమదాలవలసలోని 13 షాపులకు 367 దరఖాస్తులు చేరాయి. రణస్థలం స్టేషన్ పరిధిలో 15 దుకాణాలు కేటాయించగా, 662 దరఖాస్తులు వచ్చాయి. పొందూరు పది దుకాణాలకు 353 దరఖాస్తులు, నరసన్నపేటలో 12 దుకాణాలకు 291 దరఖాస్తులు వచ్చాయి. కొత్తూరులో ఏడు దుకాణాలకు 205 దరఖాస్తులు, పాతపట్నంలోని ఎనిమిది దుకాణాలకు 239, కోటబొమ్మాళిలోని 15 దుకాణాలకు 364, పలాసలో 15 దుకాణాలకు 239 దరఖాస్తులు వచ్చాయి. సోంపేటలో 12 షాపులకు 316, ఇచ్ఛాపురంలోని ఎనిమిది దుకాణాలకు 268, టెక్కలిలో 11 దుకాణాలకు 301 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో 14 దుకాణాలకు 380 మంది, మూడు మున్సిపాలిటీల్లో 13 దుకాణాలకు 300 మంది, 30 మండలాల్లో 131 దుకాణాలకు 3990 మంది దరఖాస్తు చేసుకున్నారు.

రూ.93.40 కోట్లు ఆదాయం

జిల్లాలోని 158 దుకాణాలకు మొత్తం 4670 మంది దరఖాస్తు చేశారు. ఒక్కొక్కరు రూ.రెండు లక్షలు చొప్పున డిడి రూపంలో ప్రభుత్వానికి డిపాజిట్ చెల్లించారు. దీంతో దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.93.40 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో 30 మండలాల పరిధిలోని 131 దుకాణాల ద్వారా రూ.79.80 కోట్ల ఆదాయం వచ్చింది. పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీల పరిధిలో ఏర్పాటు కానున్న 13 దుకాణాలకు మొత్తం 300 మంది దరఖాస్తు చేశారు. దరఖాస్తుల రూపంలో రూ.6 కోట్ల ఆదాయం సమకూరింది. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు కానున్న 14 షాపులకు 380 మంది నుంచి ద్వారా రూ.7.60 కోట్ల ఆదాయం లభించింది. లాటరీ విధానంలో దరఖాస్తు చేసుకున్న వారు మద్యం దుకాణం లైసెన్స్ పొందిన తరువాత వెంటనే 1/6 వంతు మొత్తాన్ని చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ఫారం-ఎ3 (బి) తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుంది.

గుర్తింపు కార్డులున్న వారికే లాటరీకి అనుమతి

మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహించేందుకు నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంను సిద్ధం చేశారు. లాటరీ ప్రక్రియలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎక్సైజ్ డిసి శ్రీకాంత్‌రెడ్డి, ఇఎస్ తిరుపతి నాయుడు హాజరు కానున్నారు. లాటరీ ప్రక్రియకు జిల్లాలోని 12 ఎక్సైజ్ స్టేషన్ల వారీగా దరఖాస్తుదార్లకు అనుమతిస్తారు. వారికి కోసం ప్రత్యేకంగా టెంట్లను ఏర్పాటు చేశారు. స్టేషన్ల వారీగా ఆడిటోరియంలోకి పిలిచి లాటరీ తీస్తారు. గుర్తింపుకార్డులు ఉన్న దరఖాస్తుదారులను మాత్రమే లాటరీ ప్రక్రియ లోనికి అనుమతిస్తారు. లాటరీలో పాల్గొనేందుకు వచ్చిన దరఖాస్తుదారుల వాహనాల నిలుపుదలకు ఆర్ట్స్ కళాశాల మైదానం కేటాయించారు.

పోలీస్ బందోబస్తు ఏర్పాటు

మద్యం దుకాణాలకు లాటరీ నేపథ్యంలో కోడిరామ్మూర్తి స్టేడియంలో దరఖాస్తుదారులు కూర్చోవడానికి టెంట్లు, కుర్చీల, తాగునీరును ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కోడిరామ్మూర్తి, అంబేద్కర్ ఆడిటోరియం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గ్రామీణ క్రీడలకు ఆదరణ పెరగాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రాచీన గ్రామీణ క్రీడలైన కర్రసాము, తాళింఖానాలకు ఆదరణ పెరగాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. శివతాలింఖానా వ్యాయామశాలకు వందేళ్ల చరిత్ర ఉందన్నారు. నగరంలోని ఏడురోడ్ల కూడలిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కర్రసాము, తాళింఖానా ఆత్మరక్షణ విద్యగా కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. గ్రామీణ క్రీడలు క్రీడా సంపదకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. మన పూర్వీకులు ఏ పండగ జరుపుకున్నా ఖచ్చితంగా కర్రసాము, తాళింఖానా క్రీడలను ప్రదర్శిస్తూ ఊరేగింపు నిర్వహించే వారిని పేర్కొన్నారు. నేడు ఈ క్రీడలు రోజురోజుకు కనుమరుగవుతుందని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈయన వెంట టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

నేటి నుంచి 'పల్లె పండగ'

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లెపండగ సోమవారం నుంచి వారం రోజులపాటు జిల్లాలో కొనసాగనుంది. అందుకోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో గ్రామ పంచాయతీల వారీగా చేపట్టనున్న ఈ కార్యక్రమాల్లో 3071 అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ పనులకు సంబంధించి రూ.249 కోట్లు ఖర్చు కాగలదని అంచనా వేశారు. వాటిలో ఇప్పటికే 2714 పనుల ప్రతిపాదనలకు అనుమతులు ఇచ్చారు. వాటిని వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేసి ప్రభుత్వ అనుమతి కోసం పంపించారు. ఈ పనులకు శంకుస్థాపనలు జరపడానికి గ్రామాల్లో పండగ వాతావరణం తీసుకొచ్చేందుకు యంత్రాంగం సిద్ధమైంది. గ్రామాల వారీగా సభలు నిర్వహించి స్థానిక శాసనసభ్యులు, ఉన్నతాధికారుల సమక్షంలో పనులకు శంకుస్థాపన చేస్తారు. గ్రామ సభల తీర్మానాలు తీసుకున్న తర్వాత శంకుస్థాపన చేసి పనులను ప్రారంభిస్తారు. వారం రోజుల వ్యవధిలోనే పనులు ప్రారంభించి అవతల వారం రోజుల్లో వాటిని పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో ఈ పనులు చేపట్టనున్నారు. సిమెంట్ రోడ్లు, గ్రామాల్లో అవసరమైన అన్ని రకాల భవనాలు, డ్రెయినేజీ నిర్మాణం, శ్మశాన వాటిక, ప్రహరీల నిర్మాణాలు వంటి పనులు చేపట్టనున్నారు. ఈ నెల 20న పల్లె పండగ ముగింపు ఉంటుంది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఇతర ప్రభుత్వశాఖల భాగస్వామ్యం తప్పనిసరి. అందుకోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- పాతపట్నం

దసరా పండగకు 15 రోజుల ముందే ప్రజలపై ధరల పిడుగుపడిందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఈ మేరకు ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అన్ని రకాల వస్తువుల ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో ప్రజలు పండగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజులకే కాయగూరలు, నూనెలు, పప్పులు అంటూ నిత్యావసర సరుకులు ధరలు అమాంతం పెరిగిపోయాయని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉంటే ఇప్పటికే రైతు భరోసా అమ్మఒడి, చేయూత వంటి పథకాలు అమలు చేసి పండగ వాతావరణం కలిగించే వారన్నారు. నిత్యావసరాల వస్తువుల ధరలు పెరగడంతో ప్రజలపై అధిక భారం పడిందని అన్నారు. సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇప్పుడు పథకాలు అందజేస్తారో తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజా దర్బార్ అంటూ.. షోలు చేస్తున్నారు తప్పితే.. ఇంత త్వరగా ప్రజా సమస్యలు పరిష్కారం కావాని ఆరోపించారు.

నేటి నుంచి బడులు

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్, పాఠశాలలు సోమవారం నుంచి తెరుచుకోనున్నాయి. పన్నెండు రోజుల దసరా సెలవులు అనంతరం యథావిధిగా పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. వాస్తవంగా దసరా సెలవులు పది రోజులే అయినా, అక్టోబరు 2, ఆదివారాలు కలిసి రావడంతో దసరా సెలవులు పెరిగాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సమాయత్తమవుతున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఇంద్రపుష్కరిణి పనులకు రీటెండరు
- పారిశుధ్య నిర్వహణ మెరుగుకు చర్యలు
- ఆలయ వార్షిక ఆదాయం పెంపునకు ప్రణాళికలు
- అరసవల్లి ఆలయ ఇఒ భద్రాజీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి యాత్రికులు వస్తుంటారని, వారికి అవసరమైన మౌలిక వసతులను సమకూర్చేందుకు ప్రభుత్వ అనుమతితో చర్యలు చేపట్టనున్నట్టు ఆలయ ఇఒ, దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వై.భద్రాజీ వెల్లడించారు. ఇప్పటి వరకు మాస్టర్ ప్లాన్-1 అమలులో తీసుకున్న చర్యల అనంతరం ప్రభుత్వం రెండో మాస్టర్ ప్లాన్‌ను అమలు చేసేందుకు సిద్ధమైందన్నారు. దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ అనుమతుల మేరకు మౌలిక వసతులను సమకూర్చుకోనున్నట్టు వివరించారు. ఆలయానికి ఏటా రూ.12 కోట్లకు మించి ఆదాయం సమకూరుతోందని తెలిపారు. ఆలయంలో మరిన్ని మౌలిక వసతులు సమకూర్చుకునేందుకు వీలుందన్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? ఆలయ అభివృద్ధికి తీసుకున్న చర్యలు ఏమిటి?

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి సందర్శకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. దీనివల్ల వార్షిక ఆదాయం పెద్ద మొత్తంలో సమకూర్చుకునేందుకు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. ఆలయానికి దేశవ్యాప్తంగా దక్షిణాది రాష్ట్రాలే కాకుండా ఉత్తరాధి నుంచి యాత్రికులు వచ్చి సందర్శించుకుంటున్నారు. అయితే ఆలయానికి సంబంధించి మౌలిక వసతులు సమకూర్చేందుకు అనువైన పరిస్థితి ఇప్పటి వరకు లేకుండా ఉంది. ఏడాది ఫిబ్రవరిలో ఆలయం స్థాయిని దేవాదాయ ధర్మాదాయశాఖ పెంచింది. గతంలో సహాయక కమిషనర్ స్థాయి అధికారి కార్యనిర్వహక బాధ్యతల్లో కొనసాగేవారు. అప్పట్లో ఆదాయం రూ.5 కోట్లు మించి సమకూరేది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.5.48 కోట్లు ఆదాయం సమకూరింది. 2019-20లో రూ5.96 కోట్లు, 2020-21లో 7.42 కోట్లు, 2021 -22లో కోవిడ్ కారణంగా 2.41 కోట్లు ఆదాయం మాత్రమే సమకూరింది. 2022-23లో రూ.6.62 కోట్లు, 2023-24లో రూ.8.42 కోట్లు, 2024-25లో రూ.11.26 కోట్లు ఆదాయం సమరినట్టు వివరించారు. పెరుగుతున్న ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని దేస్థానం స్థాయిని ఏడాది ఫిబ్రవరిలో పెంచారు. ప్రస్తుతం డెప్యూటీ కమిషనర్ స్థాయి అధికారికి కార్యనిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

? ఆలయ నిర్వహణకు సరిపడినంత మంది ఉద్యోగులు ఉన్నారా?

అరసవల్లి దేవస్థానం నిర్వహణ అవసరాల కోసం కార్యనిర్వహణాధికారితో పాటు ఇద్దరు సూపరింటెండెంట్లు, ఇద్దరు సీనియర్లు, ముగ్గురు జూనియర్ సహాయకులు, ముగ్గురు రికార్డు అసిస్టెంట్లు, ఎలక్ట్రీషియన్, నలుగురు అటెండర్లు, నలుగురు స్వీపర్లు మంజూరై ఉన్నాయి. వాస్తవానికి ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు అటెండర్లు మాత్రమే ఇప్పుడు పనిచేస్తున్నారు. మిగిలిన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. వీరితో పాటు ఐదుగురు అర్చకులు, పరిచారిక, పచిక, ఒక్కొరు, నలుగురు వేదపారాయణదారు, కుక్, ఐదుగురు భజంత్రీలు, సబ్ టెంపుల్‌కు, అవుట్ సోర్సింగ్, నైట్ వాచ్‌మెన్ కలుపుకుని మరో 29 పోస్టులు మంజూరై ఉన్నాయి. వీటిలో అర్చకులు, మినహా మిగిలిన పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. అవుట్ సోర్సింగ్ ద్వారా ప్రస్తుతం 48 మంది విధుల్లో ఉన్నా... వారికి కమిషనర్ నుంచి అనుమతి లేకపోవడంతో జీతభత్యాలు గడచిన నాలుగు నెలలుగా చెల్లించలేకపోతున్నాం.

? ఇంద్రపుష్కరిణి పనులు ఎప్పటి లోగా పూర్తి చేస్తారు?

ఆలయానికి ఎదురుగా విశాలమైన ఇంద్రపురణి ఉంది. స్వామివారికి ఏటా చిలుకుల ద్వాదశి పర్వదినాన నావికోత్సవం కన్నుల పండువగా నిర్వహించడం ఏటా జరుగుతున్న ఉత్సవాల్లో అత్యంత ప్రధానమైంది. పురాతన కాలం నాటి పుష్కరణి ప్రస్తుతం పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలి. అందుకోసం ఏడాదిన్నర క్రితం పునర్నిర్మాణం పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతించింది. దేవాదాయశాఖ నుంచి రూ.4 కోట్ల నిధులతో పుష్కరణి పనులు చేపట్టేందుకు టెండరు పూర్తి చేసిన తర్వాత పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టరు ప్రస్తుతం మొదలు పెట్టకుండా జాప్యం చేస్తుండడంతో పనులు ప్రారంభం కాలేదు. పనులు వర్షాకాలం పూర్తి కాగానే మొదలు పెట్టి తిరిగి వర్షాలు మొదలయ్యే నాటానికి పూర్తి చేయాల్సి ఉంటుంది.

? ప్రసాదాల తయారీపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఆలయంలో ప్రధానంగా సందర్శకులకు పులిహోరా, లడ్డూ ప్రసాదాలను విక్రయించడం జరుగుతోంది. ఈ రెండింటిలో నాణ్యత తప్పని సరి. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా లడ్డూ కల్తీ వివాదం తెరపైకి వచ్చిన నేపథ్యంలో మరిన్ని జాగ్రత్తలు పాటిస్తున్నారు. సరకుల సరఫరాలో కూడా రాజీ లేకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తున్నాం. అవసరమైన సరుకులతో పాటు ఆలయంలో ఏడాది పొడవున పువ్వులు, ఆయిల్, ఇతర సామగ్రి కొనుగోలు నేరుగా ఆలయం నుంచి కొనుగోలు చేసేవారు. ఆ పరిస్థితికి స్వస్తిపలికి దేవాదాయ శాఖ నిబంధనలకు లోబడి టెండరు ప్రక్రియ మొదలు పెట్టాం.

? వసతి సౌకర్యాలు ఎలా ఉన్నాయి?

సరిపడినంత విశాలమైన స్థలాలు ఉన్నాయి. ఆలయానికి ఎదురుగా టిటిడి సత్రం ఉంది. ప్రస్తుతం అది వినియోగంలోలేకపోవడంతో ఈ భవనాన్ని తొలగించి కొత్త భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదన పంపించాం. అలాగే ఆలయానికి ఎదురుగా ప్రయివేటు నివాస గృహాలు, ఇతర కట్టడాలు ఉన్నాయి. వాటి వల్ల ఆలయ అవసరాలకు తగినంత విశాల ప్రాంగణం లేదు. అయితే దేవాలాయానికి పూర్వీకులు దానమిచ్చిన ఆస్తులు ఉన్నాయి. వాటి విలువ ఇప్పుడు రూ.కోట్లలో ఉంది. ప్రత్యామ్నాయంగా ఆయా కుటుంబాలతో సంప్రదించి వారికి భూమిని కేటాయించి అక్కడున్న స్థలాలను స్వాధీనపరచుకునేందుకు ఉన్నత స్థాయిలో చర్చ ఉంది.

IN THE HONOURABLE COURT OF THE 1ST ADL. DISTRICT JUDGE AT SRIKAKULAM.
E.P. 95/2018 IN A.R.C. 577/2014

BETWEEN:
M/s Shriram City Union finance Ltd having its Registered office at 123, Angappa Naiken street Chennai and having its Administrative office At 3-6-478, 4th floor Anand Estates Liberty road Himayath nagar, Hyderabad, having its branch Office at Srikakulam Represented by its GPA Sri K.V. Ramana, now represented by its GPA Holder Sri K. Vasu. ...Decree Holder
AND
Paidi Lakshmana Rao & Another ...Judgement Debtor
To
R1) Paidi Lakshmana Rao,S/o Syamala Rao, R/o D.No.19-21, Yerukulapeta, Ponduru Mandal. Srikakulam District 532001.
R2) Paidi Kalyani, W/o Lakshmana Rao, R/o D.No. 19-21, Yerukulapeta, Ponduru Mandal, Srikakulam District 532001.

AGAINST WHOM IT HAS BEEN EXECUTION IS SOUGHT AGAINST THE JDR NO.2

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పై నెంబరు అమలులో అవార్డు సొమ్ము, వడ్డీ మరియు ఇతర ఖర్చులు రాబట్టే నిమిత్తం పైన ఉదహరించిన న్యాయస్థానంలో తేది 29-10-2024 ఉదయం గం॥ 10.30 ని॥ల నుండి సాయంత్రం 5 గం॥ల మధ్య కాలంలో బహిరంగంగా వేలం వేయబడును. కావున కావలసినవారు ఆ సమయంలో వేలంలో పాల్గొన వచ్చునని ఇందుమూలంగా తెలియపర్చడమైనది.

PETITION SCHEDULE FILED BY THE DECREE HOLDER MOST RESPECTFULLY SHOWETH AS FOLLOWS:

Srikakulam District, Ponduru Sub-District, Ponduru, Yerukulapeta Village site measuring 168 Sq.yards covered by S.No.359 situated at Ward no.19, Ponduru, Yerukulapeta Village, Ponduru Panchayat & Mandal together with building bearing assessment No.2392 and bounded by: **East :** Land of Vendors, **South:** Raja Margam, **West:** Site of Ch.Rami Naidu, **North:**Common passage between this property and Chintada Lakshsmana Rao.

DHR value : 20,00,000/-
Amine Value : 30,00,000/-
Hearing date : 29.10.2024
Further Hearing date : 06.11.2024

MANCHU JANARDHANA RAO, Advocate
Jami Thota, Visakha 'A' Colony, Srikakulam Town & Dist.
Ph. No : 9849178948, 9704986271, 9866509590, 9849824246

IN THE HONOURABLE COURT OF THE 1ST ADL. DISTRICT JUDGE AT SRIKAKULAM.
E.P. 564/2019 IN A.R.C. 175/2015

BETWEEN:
M/s Shriram City Union finance Ltd having its Registered office at 111, Angappa Naiken street Chennai and having its Administrative office At 3-6-478, 4th floor Anand Estates Liberty road Himayath nagar, Hyderabad, having its branch Office at Palasa Represented by its GPA Sri G. Suresh ...Decree Holder
AND
Ratnala Prasada Rao & Others ...Judgement Debtor
To
R1) Ratnala Prasada Rao, S/o Late Venkata Rao, Hindu, aged 50 years R/o D.No.5-43, Tekkali, Ward-1, Srikakulam Dist-532201.
R2. S.Krishna Rao, S/o Appanna Rao, Hindu, aged 40 years, R/o D.No. 1-62, Pedda Veedhi, Dimilida, Srikakulam dist 532206.
R3. S.Sandhya, D/o S.Someswara Rao, Hindu, aged 30 years, R/o D.No. 1-25, Sc Veedhi, Goppali, Meliaputti, Srikakulam Dist.

AGAINST WHOM IT HAS BEEN EXECUTION IS SOUGHT AGAINST THE JDR NO. 1

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పై నెంబరు అమలులో అవార్డు సొమ్ము, వడ్డీ మరియు ఇతర ఖర్చులు రాబట్టే నిమిత్తం పైన ఉదహరించిన న్యాయస్థానంలో తేది 29-10-2024 ఉదయం గం॥ 10.30 ని॥ల నుండి సాయంత్రం 5 గం॥ల మధ్య కాలంలో బహిరంగంగా వేలం వేయబడును. కావున కావలసినవారు ఆ సమయంలో వేలంలో పాల్గొన వచ్చునని ఇందుమూలంగా తెలియపర్చడమైనది.

PETITION SCHEDULE FILED BY THE DECREE HOLDER MOST RESPECTFULLY SHOWETH AS FOLLOWS:

Srikakulam District, Tekkali Md, Tolusurupalli Panchayat and Village accounts, eastern side of road leading from Tekkali to Tolusupalli S.No. 570/1 out of an extent of **Ac.0.18** cents site measuring East to West 48.6 feet North to South 60 feet, houses bearing D.Nos. 1-303 & 1-304 two portions B Type ground floor Western side portion bearing D.No.1-303 measuring East to West 24 feet or 7.320 meters and North to South 60 feet or 18.280 meters measuring 160 Sq. Yards together with ground floor with Plinth area of 1128 SFT, back yard 55 SFT, Lavatory And bath rooms half share, well half share is bounded by: **East:** Building of Donor (Ratnala Bala Subramanyam) **West:** Land of Donee (Ratnala Prasada Rao) **South:** 3 feet with Common Drainage **North:** 12' Width Road.

DHR value : 30,00,000/-
Amine Value : 45,00,000/-
Hearing date : 29.10.2024
Further Hearing date : 06.11.2024

MANCHU JANARDHANA RAO, Advocate
Jami Thota, Visakha 'A' Colony, Srikakulam Town & Dist.
Ph. No : 9849178948, 9704986271, 9866509590, 9849824246

ప్రథమ చికిత్సా కేంద్రాలు అవసరం

ఎమ్మెల్యే గొండు శంకర్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి, అనారోగ్యానికి, చిన్నచిన్న గాయాలకు, సాధారణ శరీర రుగ్మతలకు, నిపుణుల వైద్యం అందేవరకు తాత్కాలికంగా ఉపయుక్తకరమైన వైద్యవిధానాన్ని అందించే ప్రథమచికిత్స కేంద్రాల అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని అంపోలు పంచాయతీ పిల్లకానిపేటలో ఆదివారం శ్రీకృష్ణ ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నచిన్న గాయాలకు కట్టు కట్టడం, రక్తం పోకుండా ఆపడం, ఊపిరి అందక కష్టంగా ఉన్నప్పుడు కృత్రిమంగా ఇవ్వడం తదితర వైద్యం ప్రథమ చికిత్స కిందకే వస్తుందని వివరించారు. ప్రథమ చికిత్స రకాల అత్యవసర పరిస్థితుల్లో అనారోగ్యంతో, గాయపడిన వ్యక్తికి సహాయం చేయడానికి ఉపయోగపడుతున్నాయి. ఒక వ్యక్తి ప్రమాదకరమైన పరిస్థితుల్లో పడిపోవడం, మూర్ఛ, స్ట్రోక్, గుండె పోటును అనుభవించినప్పుడు తక్షణమే ప్రథమ చికిత్స చేసి ఆ వ్యక్తి ప్రాణాలు నిలపవచ్చని చెప్పారు.

వినతిపత్రం అందజేస్తున్న దుర్గారావు

లోకేష్‌ని కలిసిన దుర్గారావు

పలాస: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వగృహంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను జనసేన పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకి శాశ్వత భవనాలు, హాస్టల్ కల్పించాలని కోరారు. అద్దె భవనాల్లో ఉంటూ పిల్లలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆయనతో చర్చించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూండి జూనియర్ కళాశాలలకు శాశ్వత భవనాలు, ఆఫ్‌షోర్ రిజర్వాయరు, పలాసకు నైపుణ్యాభివృద్ధి కేంద్రం, ఆధునిక విద్యతో కూడిన ప్రభుత్వ పాఠశాల నిర్మించాలని కోరారు. పూండిలంక వంతెన, జీడిపప్పు పరిశోధన కేంద్రం, మత్స్యకార అభివృద్ధి కారిడార్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో అనధికార బ్రోకర్ల వల్ల గల్ఫ్ బాధితులు రోజు రోజుకీ అధికం అవుతున్నారని, వారికోసం తక్షణ హెల్ప్‌లైన్ నంబరు భవిష్యత్‌లో గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పై సమస్యలపై లోకేష్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

బహుమతులను అందజేస్తున్న నాయకులు

రాష్ట్రస్థాయి క్విజ్ విజేత లండారిపుట్టుగ

ఇచ్ఛాపురం : మండలంలోని బూర్జపాడులో సరస్వతి పూజ పంచరాత్రి మహోత్సవాలు సందర్భంగా ఉద్యోగ సంఘం ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు శనివారం రాత్రి నిర్వహించారు. ఈ పోటీల్లో కవిటి మండలం లండారిపుట్టుగ జట్టు మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి విజయనగరం జిల్లా నెల్లిమర్ల జట్టు, తృతీయ బహుమతి వజ్రపుకొత్తూరు మండలం పూండి జట్టు కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా విజేతలకు జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మలు బహుమతులు అందజేశారు. క్విజ్ మాస్టర్లుగా శమ్మ రాజబాబు, శ్రీనివాస్, నీలాచలం, భూషణం వ్యవహరించారు.

'కుప్పిలి' కవితకు ప్రశంసాపత్రం

ఆముదాలవలస: పట్టణానికి చెందిన కవి, రచయిత కుప్పిలి వెంకట రాజారావు రచించిన కవితకు జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించాయి. యస్-7 గూగుల్ సంస్థ జాతీయస్థాయిలో సెప్టెంబర్ నెలలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇంగ్లీషు కవితల పోటీలో పట్టణానికి చెందిన కవి కుప్పిలి వెంకట రాజారావుకు ప్రశంసా పత్రం లభించింది. ఆయన రచించిన 'డార్క్ సీన్' (చీకటి దృశ్యం) కవితకు ఈ ప్రశంస లభించింది. సమాజంలోని వివక్ష పోకడలపై రచించిన కవితకు ఈ ప్రశంసాపత్రం లభించడం చాలా ఆనందంగా ఉందని వెంకట రాజారావు అన్నారు. రాజారావుకు ప్రశంసా పత్రం లభించడంపై పట్టణానికి చెందిన ప్రముఖులు, కవులు, రచయితలు, అభిమానులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

వేణుగోపాలస్వామి సందర్శన

మెళియాపుట్టి : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయాన్ని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి కోర్టు ఎడిషనల్ జడ్జి మహేంద్ర ఫణికుమార్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

దయనీయం.. గిరిజనుల జీవనం

- రాళ్లు తేలిన రహదారి
- కలుషితమైన తాగునీరు
- కనీస సౌకర్యాలు లేని బూర్జమానుగూడ

గిరిజన గ్రామాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. వారి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని అటు పాలకవర్గం ఇటు అధికార యంత్రాంగం ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారే తప్ప ఆదిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఆ గ్రామం అనునిత్యం అవస్థలకు గురవుతుంది.

ప్రజాశక్తి- బూర్జ

పుట్టిన ఊరిలో బతుకు లేక పొట్ట చేత పట్టుకొని వలస వచ్చిన వారికి కనీస సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. కొత్తూరు మండలం అద్దంగి గిరిజన గ్రామానికి చెందిన 12 కుటుంబాలు 2014లో మండలంలోని అప్పలపేట పంచాయతీ పరిధిలో బూర్జమానుగూడలో కొండల దిగువ భాగంలో నివాస ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం చేసేందుకు సెంటు భూమి లేకపోయినప్పటికీ కొండపోడు వ్యవసాయం చేసుకొని కడుపు నింపుకుంటున్నారు. అయితే గ్రామంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో అనునిత్యం తీవ్ర అవస్థలు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు


బూర్జమానుగూడ గ్రామం

గ్రామంలో భయం భయం

కొండ దిగుభాగంలో నివాసం ఉన్న తాము అనునిత్యం భయం భయంగానే గడుపుతున్నామని గిరిజనులు తెలిపారు. ముఖ్యంగా కొండ చెరియలు పడుతున్నాయని, వర్షాకాలంలో కొండల నుంచి జాలువారే నీటితో అనునిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మన్నారు. రక్షణ గోడ నిర్మించాలని అధికారులకు, పాలకులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజనులు వాపోతున్నారు.

రక్షణ గోడ నిర్మించాల్సిన కొండ

పాఠశాల, అంగన్వాడీ లేదు

గ్రామంలో పాఠశాల లేకపోవడంతో తమ పిల్లలను ఆటోలో మదనాపురానికి పంపిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్రం కూడా లేకపోవడంతో దిగువ భాగంలో ఉన్న గోపీదేవిపేట గ్రామానికి పంపిస్తున్నామని, రేషన్ కోసం కూడా మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు.

చీకట్లోనే గ్రామం

ఐటిడిఎ ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు వెలగకపోవడంతో రాత్రులు చీకట్లోనే కాలం గడుపుతున్నామని గిరిజనులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామంలో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాడుకలకు వినియోగిస్తున్న బోరు నీరు

నడక కష్టాలు తీరేది ఎప్పుడో

మూడు కిలోమీటర్ల మేర రాళ్లు తేలిన రహదారిపై అనునిత్యం నడవలేకపోతున్నాం. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం శూన్యం. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పూర్తి చేయాలి.

- సవర ప్రసాద్, బూర్జమానుగూడ

సమస్యలు పరిష్కరించాలి

కొన్నేళ్లుగా గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలి. కలుషిత నీరు తాగడం వలన వ్యాధులు సంక్రమిస్తున్నాయి. కనీస సౌకర్యాలు కల్పించేందుకు పాలకవర్గం, ఐటిడిఎ అధికారులు శ్రద్ధ చూపాలి.

- సవర చిన్నమ్మి, బూర్జమానుగూడ

తాగునీరు గరళం

ప్రభుత్వం గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు బోర్ల నీరు గరళమేనని గిరిజనులు తెలిపారు. అప్పట్లో ఐటిడిఎ పిఒగా ఉన్న శివశంకర్ గ్రామాన్ని సందర్శించి బోరు నీటిని పరిశీలించారని గ్రామస్తులు తెలిపారు. బోరు నీటిని టెస్టింగ్‌కు పంపిన తర్వాత ఈ నీటిని కనీస అవసరాలకు కూడా ఉపయోగించవద్దని చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే ప్రభుత్వం మరో బోరును ఏర్పాటు చేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నీటిని అవసరాలకు ఉపయోగించుకుంటున్నామని గిరిజనులు తెలిపారు. తాగేందుకు మాత్రం మదనాపురం గ్రామం నుంచి కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని గిరిజనులు వాపోతున్నారు.

నడక యాతన

ఈ గ్రామానికి 2022లో సుమారు రూ.90 లక్షలతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో పక్కా రహదారి ఏర్పాటు చేసేందుకు మాజీ స్పీకర్ శంకుస్థాపన చేశారు. అయితే నేటికి కూడా రహదారి నిర్మాణం పూర్తి కాకపోవడంతో గ్రామస్తుల అవస్థలు వర్ణతీతం. గ్రామం నుంచి అత్యవసర సమయంలో 108, 104 వాహనాలు రాకపోవడంతో డోలి కట్టాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సవర నందిని పాము కాటుకు గురికావడంతో వైద్యం కోసం వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో మృతి చెందిందని గిరిజనులు పేర్కొన్నారు.

రాళ్లుతేలిన రహదారి

పల్లె పండగకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ఈనెల 14 నుంచి 20 వరకు పల్లెపండగ పంచాయతీ వారోత్సవాలు, భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ పి.వెంకటరాజు తెలిపారు. 14న మురపాక, బుడత వలస, చిన్నమురపాక, కేశవరాయని పాళెం, పెంట పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించడం జరుగు తుందన్నారు. 15న బుడుమూరు, చిన్నరొంపివలస, చిన్నయ్యపేట, గుంటుకుపేట, పేదరావుపల్లి, 16న బొంతు పేట, బెజ్జిపురం, తామాడ, పాతరౌతుపేట, లక్ష్మీపురం పంచా యతీల్లో, 17న గుమ్మడాం, సహపురం, గురుగుబిల్లి, సిగురుకొత్తపల్లి, తాళ్లవలస గ్రామాల్లో, 18న అదపాక, గుర్రల పాళెం, పెద్దకొత్తపల్లి, పాతకుంకాం, కొత్తకుంకాం, పైడాయ వలస పంచాయతీల్లో, 19న గోవిందపురం, కొత్తకోట, పెదలింగాలవలస, పోతయ్య వలస, వెంకటా పురం, 20న అప్పాపురం, లావేరు పంచాయతీల్లో పల్లె పండుగ వారోత్సవాలు, భూమిపూజ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇచ్ఛాపురం : ఈ నెల 14 నుంచి 20 వరకు పంచాయతీల్లో నిర్వహించనున్న పల్లెపండగకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపిడిఒ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి పది వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 14న బూర్జపాడు, ఈదుపురం, కేసిపురం, 15న కొఠారి, ధర్మపురం, తులసిగాం, 16న లొద్దపుట్టి, అరకభద్ర, టి.బరంపురం, 17 మశాకపురం, బిర్లాంగి, తెలుకుంచి, 18న పాయతారి, కీర్తిపూర్, కొలిగాం, 19 బొడ్డాకాళి, మండపల్లి, 20 కేదారిపురం, ముచ్చింద్రా పంచాయతీల్లో పల్లెపండగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మెళియాపుట్టి : మండలంలో సోమవారం నుంచి 20 వరకు పల్లె పండగ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా ఒక ప్రకటనలో తెలిపారు. 14న బాణాపురం, ముకుందపురం, జాడుపల్లి, 15న ఆంపురం, చాపర, గొట్టిపల్లి, ఇలైపురం, మెళియాపుట్టి, జోడూరు, 16న పట్టుపురం, భరణికోట, చీపురుపల్లి, కరజాడ, మారేడుకోట, మర్రిపాడు-కె, ముక్తాపురం, పరశురాంపురం, 17న గంగరాజుపురం, కోసమాల, నడసంద్ర, పెద్దలక్ష్మీపురం, శేఖరాపురం వసుంధర, 18న గోకర్ణపురం, గొప్పిలి, కొత్తూరు, రట్టిని, ఎస్.కొలిగాం, సంతలక్ష్మీపురం, 19న దీనబంధుపురం, 20న సుందరాడ, సిరియాకండి, పెద్ద పద్మాపురం, పడ్డ, కేరాసింగి, మర్రిపాడు సి- వెంకటాపురం పంచాయతీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని అన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పలాస : పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్థశాస్త్రం బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కుప్పిలి నరసింహమూర్తి ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గలవారు వెంటనే కళాశాలలో తమ బయోడేటా అందజేయాలన్నారు. ఈ నెల 16న ఉదయం 10 గంటలకు జరగనున్న ఇంటర్వ్యూకు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి- పోలాకి

పోలాకి కేంద్రంలోని విశ్వేశ్వరనగర్ కాలనీలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టిడిపి మండల అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు భరోసా ఇచ్చారు. కాలనీ వాసులు వెదుళ్లవలసలో ఆయన స్వగృహంలో కలసి తమ సమస్యలు తెలియపరుస్తూ ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీ ఏర్పాటై సుమారు 20 ఏళ్లు అయిందన్నారు. కాలనీలో వంద కుటుంబాలు పైబడి శాశ్వత నివాసాలు నిర్మించుకుని ఉంటున్నారని అన్నారు. ఇప్పటివరకు కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ, ప్రధాన రోడ్డు, సిసి రోడ్లు నిర్మించలేదని, సామాజిక భవనం, చిల్డ్రన్‌పార్క్ మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించి ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

నేడు మంత్రి పర్యటన

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీలో సిసి రోడ్ల నిర్మాణాలకు సోమవారం 4 గంటలకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలిలో జిల్లా ఆస్పత్రి నుంచి తెంబూరు రోడ్డు వరకు సిసి రోడ్డు, అయ్యప్ప నగర్‌లో సిసి రోడ్లు కాలువలు, మండపొలం కాలనీలో సిసి రోడ్లు కాలువలు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొవాలని కోరారు.

వస్త్ర దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

వస్త్ర రంగం విస్తరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో వస్త్ర, వ్యాపార రంగం విస్తరించి వినియోగదారులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని పెద్దరెల్లివీధిలో జివిఆర్ టెక్స్‌టైల్స్ వస్త్ర దుకాణాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా దుకాణ యజమానులను ఆయన అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టెక్స్‌టైల్స్ పరిశ్రమ దేశంలో ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. జివిఆర్ టెక్స్‌టైల్స్ మహిళలకు కావాల్సిన వస్త్రాలతో పాటు ఇళ్లల్లో వాడే మేట్స్, ఇతర గృహోపకరణాలను అతితక్కువ ధరకే అందిస్తున్నారన్నారు. వినియోగదారులకు నాణ్యతతో కూడిన ఆకర్షించే రీతిలో వస్త్రాలను అందుబాటులో ఉంచుతూ తగ్గింపు ధరల్లో అందించాలని ఎమ్మెల్యే శంకర్ దుకాణ యజమానులకు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అందవరపు సంతోష్, మాదారపు వెంకటేష్, మూర్తి రెడ్డి గిరిజా శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ వేలం పాట

రణస్థలం: మండల కేంద్రంలోని దుర్గా శరన్నవరాత్రులు సందర్భంగా సూర్య స్వీట్స్ యాజమాన్యం లడ్డూ తయారు చేసి మండపంలో ఏర్పాటు చేశారు. దుర్గాదేవి అనుపు సందర్భంగా కమిటీసభ్యులు నిర్వహించిన లడ్డూ వేలంపాటలో లడ్డూను మండల కేంద్రానికి చెందిన ఎచ్చెర్ల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ పీడీ మన్నెల శ్రీనివాసరావు రూ. 21 వేలకు లడ్డూను వేలం పాటలో దక్కించుకున్నారు. లడ్డూను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చేతులమీదుగా శ్రీనివాసరావు తలపై పెట్టి భారీ ఊరేగింపు నిర్వహించారు.

కలశం వేలం

పొందూరు : కలశంతో రిషిత, గ్రామపెద్దలు

పొందూరు: మండలం రాపాకలో దేవీ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి మండపం వద్ద అమ్మవారి కలశం వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాటలో కలశాన్ని గ్రామానికి చెందిన వండాన రిషిత రూ.63, 500లకు కైవసం చేసుకున్నారు. అనంతరం అమ్మవారి కలశంను ఊరేగించారు. కార్యక్రమంలో భవాని భక్తులు, గ్రామ పెద్దలు, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

సోంపేట : ఇటీవల పదో తరగతి పరీక్షల్లో 500 పైగా మార్కులు సాధించిన 24 మంది శ్రీశయన విద్యార్థులకు శ్రీశయన చైతన్య దీపిక సంస్థ నగదు ప్రోత్సాహకాలను శనివారం అందజేశారు. స్థానిక రోటరీ క్లబ్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఒక్కో విద్యార్థికీ రూ.3 వేలు చొప్పున అందజేశారు. ఏటా విజయదశమి రోజున శ్రీశయన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించి ప్రోత్సహించడం ఆనవాయితీ. విద్యార్థులకు రోటరీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు వాటర్ బాటిళ్లు, మొక్కలు అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మోహనరావు, వీర్రాజు, ఈశ్వరరావు, ఆనందరావు పాల్గొన్నారు.

భర్త చంటి మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య భవాని

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని కేశవరాయపాళెం పంచాయతీ హనుమయ్యపేట గ్రామ సమీపంలో శనివారం రెండు దిచక్రవాహనాలు ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. భర్త మృతి చెందంతో మనస్థాపంతో భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్న ఘటన పండగ రోజున కేశవరాయపాళెంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన నాయన చంటి (26) శనివారం ఉదయం టిఫిన్ చేసేందుకు మురపాక గ్రామం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా హనుమయ్యపేట సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో చంటి రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో భార్య భవానీ, కుటుంబ సభ్యులు వచ్చి బోరున విలపించారు. చంటికి రెండేళ్ల క్రితం ఎచ్చెర్ల మండలంలోని నందిగాం గ్రామానికి చెందిన భవానీతో వివాహమైంది. భవానీ ప్రస్తుతం నాలుగు నెలల గర్భవతి. చంటి ఆటోనడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తండ్రి కన్నయ్య, తల్లి ఎల్లమ్మ ఉన్నారు. చంటి మృతదేహానికి శనివారం లావేరు పోలీసులు శవపంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. హెచ్‌సి రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త మృతితో భార్య ఆత్మహత్యాయత్నం

భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో భార్య భవానీ ఆదివారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. నోటి నుంచి నురగలు రావడంతో కుటుంబీకులు గుర్తించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. భవానీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపారు. పండగ రోజు ఇలా భర్త మృతి, భార్య చావు బతుకుల మధ్య ఉండంతో కేశవరాయపాళెంలో విషాధచాయలు అలము కున్నాయి. లావేరు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్‌పై నుంచి జారిపడి...

సురేష్ (ఫైల్)

మెళియాపుట్టి : మండలంలోని మురికింటి భద్రకు చెందిన సవర సురేష్ (26) శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదుపుతప్పి పడిపోయాడు. కడుపులో దాచుకున్న మద్యం బాటిల్ పగిలిపోయి గాజు పెంకులు కడుపులో గుచ్చుకోవడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసు లు ఘటనాస్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి తల్లి, ఇద్దరు చిల్లెల్లులు ఉన్నారు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఎస్ఐ పి.రమేష్ బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి కార్డులు పంచేందుకు వెళ్తూ...

మోహనరావు (ఫైల్)

టెక్కలి రూరల్ : మండలంలో అక్కువరం పంచాయతీ శ్యామ సుందరాపురానికి రుంకు మోహనరావు (55) ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 20న తన కుమార్తె హిమ వివాహం కానుంది. ఈ నేపథ్యంలో పెళ్లి పిలుపులకు సైకిల్‌పై వెళ్తుండగా టెక్కలి జాతీయ రహదారిపై విక్రంపురం సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. 108 సహాయంతో జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి బాలుడు మృతి

త్రినాథ్ (ఫైల్)

కంచిలి : మండలంలోని కొత్త అంపురానికి చెందిన మద్ది త్రినాథ్ (12) శనివారం గ్రామ సమీపంలోని చెరువులో జారిపడి మృతి చెందాడు. స్థానికులు, కంచిలి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మద్ది నీలయ్య కుమారుడు త్రినాథ్ విజయదశమి సందర్భంగా పూజ చేసేందుకు తన సైకిల్‌ను శుభ్రం చేస్తున్నాడు. గట్టుపై సైకిల్ ఉంచి చెరువు లోపల నుంచి బకెట్‌తో నీళ్లు తెస్తున్నాడు. నీళ్లు తెచ్చే క్రమంలో చెరువులో జారిపోయి మునిగిపోయాడు. సమీపంలో ఉన్న పిల్లలు ఇది గమనించి కేకలు వేశారు. అక్కడే ఉన్న కొంత మంది చెరువులో దిగి బాలుడిని ఒడ్డుకు తీసుకొచ్చారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న త్రినాథ్‌ను సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు తెచ్చేసరికి బాలుడు మృతి చెందినట్లు చెప్పడంతో కుటుంబ సభ్యులు బోరుమన్నారు. పండగ రోజులో కుమారుడి అకాల మృతితో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు. సంఘటనపై మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ రామచంద్రరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

పలాస : పలాస రైల్వేస్టేషన్ 3వ నంబరు ప్లాట్‌ఫారంపై సోమవారం గుర్తు తెలియని యువకుడు (30) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనలో కామాఖ్య సూపర్ ఫాస్ట్ రైలు ప్లాటఫారంపై గంటపాటు నిలిచిపోయింది. మృతదేహాన్ని తరలించిన అనంతరం రైలును యథావిధిగా పంపించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 7 గంటల ప్రాంతంలో కామాఖ్య రైలు పలాస మీదుగా భువనేశ్వర్ వైపు వెళ్తాంది. ప్లాట్‌ఫారంపై నుంచి గుర్తు తెలియని యువకుడు ఒక్కసారిగా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్లాట్‌ఫారంపై రైలు వేగాన్ని నియంత్రించి వెళ్తున్న క్రమంలో ఈ సంఘటన చూసిన డ్రైవర్ రైలును నిలిపివేశారు. అప్పటికే ఆ యువకుడి శరీరం నుజ్జయి చక్రాల కింద నలిగిపోయింది. గస్తీలో ఉన్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైలును వెనక్కు మళ్లించారు. అప్పటికే ఆ యువకుడు మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. అంతకు ముందు ఆ యువకుడు ఫలక్నామా రైలులో వచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. తాను ఆత్మహత్య చేసుకుంటానని, తనను ఆపకండని తోటి ప్రయా ణికులకు చెప్పినట్లు సమాచారం. ముందుగా అదే రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి గాయపడ్డాడు. రైల్వే సిబ్బంది ఆస్పత్రికి తరలిం చడానికి సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో వెకను నుంచి వచ్చిన మరో కామాఖ్య రైలు కింద దూకి ఆత్మహత్యకు పాల్పడడంతో తీవ్ర సంచలనం కలిగించింది. హెచ్‌సి సోమేశ్వరరావు కేసునమోదు చేసుకొని మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి సంబంధించిన వివరాలు లభ్యం కాలేదన్నారు. కోలకత్తా ప్రాంతానికి చెందిన వాడిగా అనుమానిస్తున్నామని జిఆర్‌పి పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

కంచిలి : అరుణ (ఫైల్)

కంచిలి : మండలంలోని పద్మతులకు చెందిన పులి అరుణ (27) శనివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అరుణ, భర్త లక్ష్మీనారాయణ తరచు గొడవలు పడుతుండేవారు. వీరికి ఐదో తరగతి చదువుతున్న మధు, మూడో తరగతి చదువుతున్న నిహారిక పిల్లలు ఉన్నారు. లక్ష్మీనారాయణ ఇచ్ఛాపురం బోర్డర్లో క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసై తరచూ గొడవలు పడుతూ, వేధిస్తుండడంతో మనస్తాపానికి గురైన అరుణ ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకొంది. దీనిని గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోంపేట సిఐ మంగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తల్లి మృతితో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

కంచిలి: మండలంలోని పెద్ద కొజ్జిరియా కూడలి వద్ద జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మకరంపురానికి చెందిన వజ్జ త్యాగరాజు, కవిత అనే దంపతులకు గాయాల య్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జాడుపూడి శుభ కార్యక్రమానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నారు. పెద్ద కొజ్జిరియా గ్రామం వైపు నుంచి వస్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కావడంతో సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. ఎస్ఐ రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాయిబాబా మృతికి కేంద్రమే బాధ్యత వహించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఢిల్లీ విశ్వ విద్యాలయంలో అధ్యాపకునిగా ఉన్న విద్యావేత్త, అంగవైకల్యం ఉన్న వ్యక్తిని రాజద్రోహం కేసులో నిర్బంధించి సుదీర్ఘ కాలం పాటు ఆయనను వేధింపులకు గురి చేసిన కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా ఆయన మృతికి కారణమైందని, అనారోగ్యం పాలై మృతి చెందడానికి మోడీ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని విప్లవ ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తారు. ఆదివారం నగరంలోని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పలువురు నేతలు నివాళ్లర్పించారు. జి.ఎన్.సాయిబాబా మరణవార్త విప్లవ ప్రజా సంఘాలకు తీవ్ర విషాదానికి, దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యావేత్తగా నైతిక బాధ్యతతో నూతన సమాజం కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. సాయిబాబా నిర్దోషిగా విడుదలైనప్పటికీ సుదీర్ఘ కాలం జైలులో ఉంచి బయటకు రానీకుండా అనేక అడ్డంకులు సృష్టించారని, దీంతో అనారోగ్యం బారిన పడ్డారని, 90 శాతం వికలాంగుడైనప్పటికీ అప్పీల్ పెండింగ్‌లో ఉన్న సమయంలో కూడా ఆయనకు బెయిల్ ఇవ్వలేదన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా పదేళ్ల నాగపూర్ జైల్లో పెట్టి, క్రూరంగా బాధించిందన్నారు. మానసికంగా ఒత్తిడికి గురై అనారోగ్యం బారిన పడ్డారని, మోడీ నేతృత్వాన గల కేంద్ర ప్రభుత్వం చేపట్టిన దుర్మార్గ పద్ధతులు అవలంభించారన్నారు. బిజెపి ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడడమే ఆయనకు ఇచ్చిన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఐఎఫ్‌టియు అధ్యక్ష, కార్యదర్శులు మామిడి క్రాంతి, డి.గణేష్, అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు గొరకల బాలకృష్ణ, రాపాక మాధవరావు, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు సవలాపురపు కృష్ణవేణి, పోతనపల్లి కుసుమ, ప్రగతిశీల యూత్ లీగ్ నాయకులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాంకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్సీ కళ్యాణి

'తమ్మినేని'ని కలిసిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపి పార్లమెంటరీ పార్టీ నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఆదివారం వైసిపి ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మర్యాద పూర్వకంగా తమ్మినేని స్వగృహంలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రస్తుత జిల్లా రాజకీయ పరిస్థితులపై కాసేపు చర్చించుకున్నారు.

రక్తదానం చేస్తున్న సునీల్

20 మంది రక్తదానం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బెలగాంలో స్పెషల్ గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ సభ్యుడు దోపాను సునీల్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 20 మంది యువకులు రక్తదానం చేశారు. ముఖ్యంగా సునీల్ ఇప్పటివరకు 37 సార్లు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలవడం కాకుండా రక్తదానంపై ఉన్న అపోహలు తొలగించడంలో కీలక పాత్ర పోషించినట్టు ఎస్‌జిఎఫ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఉద్దానం బ్లడ్ బ్యాంకు సభ్యులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న ప్రధాన రోడ్డు

ప్రధాన రహదారి వెలవెల

పాతపట్నం : పాతపట్నంలోని ప్రధాన రహదారి నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సులు, విద్యార్థులు, ప్రజలతో ప్రధాన రహదారి కలకలలాడేది. దసరా పండగ సందర్భంగా శనివారం లాక్‌డౌన్ తలపించే విధంగా ప్రధాన రోడ్డు వెలవెలబోయింది. దసరా పర్వదినం సందర్భంగా స్కూళ్లు, కళాశాలలు, కార్యాలయాలకు సెలవులు కావడం, వ్యాపారస్తులు దుకాణాలు మూసి వేయడం, గ్రామీణ ప్రాంత ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పట్టణ ప్రజలు కూడా బయటకు రాకపోవడంతో రోడ్డు నిర్మానుష్యంగా మారింది. దీనికితోడు ఎండ తీవ్రత కూడా ఎక్కువగా ఉండడంతో రోడ్డు పూర్తిగా ఖాళీగా కనిపించింది.

రహదారి పచ్చదనం

మెళియాపుట్టి: మండలంలో జాడుపల్లి- సుర్జిని గ్రామాల మధ్య రహదారి పచ్చదనంగా కనిపిస్తోంది. రహదారికి ఇరువైపులా ఉపాధిహామీ పథకం కింద నాటిన మొక్కలు పెద్దవై రోడ్డుకు ఇరువైపులా ఆహ్లాద కరంగా కనిపిస్తున్నాయి. రోడ్డుకు అందంతో పాటు రాకపోకలు సాగించే వారికి మొక్కలు నీడనిస్తున్నాయి.

మొక్కలతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న సుర్జిని రహదారి

ఆలయాలను దర్శించుకున్న ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

విజయదశమి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని మెట్టక్కివలస పాలపోలమ్మ గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాల శరన్నవరాత్రుల మహోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించు కున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, నాగళ్ల మురళీధర్, తంగి గురయ్య, గుర్నాథరావు, గుడ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : ఆశీర్వాదం అందుకుంటున్న ఎమ్మెల్యే

దుర్గాదేవి సందర్శన

పోలాకి: దుర్గాదేవి శరన్నవరాత్రులు మహోత్సవాల్లో మండలంలోని మాకివలసలో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం సందర్శించారు. అదేవిధంగా పోలాకిలోని దుర్గాదేవి ఆలయాన్ని దర్శించు కున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, నరసన్నపేట మాజీ మండల ప్రజా పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు శిమ్మ పాపినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ యాళ్ల వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు

ఆమదాలవలస : కృష్ణమాదిగకు స్వాగతం పలుకుతున్న విజయ్

మందకృష్ణ మాదిగకు స్వాగతం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు పట్టణంలో ఘన స్వాగతం లభించింది. ఆదివారం పట్టణంలోని శారదా కళ్యాణ మండపంలో జరిగిన మాజీ ఎంపిటిసి, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకుడు లోపింటి నారాయణరావు కుమారుని వివాహానికి ఆయన విచ్చేశారు. పట్టణానికి కృష్ణ మాదిగ వస్తున్న సమాచారాన్ని తెలుసుకున్న ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఎంఆర్‌పిఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర టిడిపి క్రైస్తవ మైనార్టీ ఉపాధ్యక్షులు రాడ విజయ్ కుమార్ కృష్ణ మాదిగకు పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం పలువురు వివిధ అంశాలపై ఆయనతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు లోపింటి తేజేశ్వరరావు, రాజు, కృష్ణ, భాస్కరరావు, ఎస్.రామారావు, వివిధ సంఘాల నాయకులు, ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామారావు మృతి తీరని లోటు

సోంపేట: ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు శంభాన రామారావు మృతి పార్టీకి, ప్రజా పోరాటాలకు తీరని లోటని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మండలంలోని గొల్లకంచిలిలో ఆదివారం నిర్వహించిన రామారావు సంస్మరణ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామారావు కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా కల్పించారు. అహర్నిశలు ప్రజా సమస్యల కోసం, దళితుల అభివృద్ధికి, సంక్షేమానికి, ఐక్యతకు కృషిచేసిన రామారావు అందరికీ ఆదర్శనీయడన్నారు. ముందుగా రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఆదమరిస్తే ఆపదే..

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని జాతీయ రహదారిపై పెద్ద గుంత ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. పొరపాటున ఆదమరిస్తే ఇక ఆపదలో చిక్కుకున్నట్లే. జాతీయ రహదారి తాళ్లవలస పంచాయతీ సుభద్రాపురం కూడలిలో జాతీయ రహదారి గుండా వచ్చే వర్షం నీరు వెళ్లేందుకు జాతీయ రహదారి నిర్మాణం జరిగేటప్పుడు కాలువ ఏర్పాటు చేశారు. దానిపై నుంచి వాహనాలు ప్రయాణించేందుకు కాలువపై ఇనుప జల్లెడ కట్టి శ్లాబ్ వేశారు. అయితే ఇటీవల శ్లాబ్ ముక్కలుగా విరిగి తడకగా కట్టిన ఇనుము వంగిపోయి శ్లాబ్ పలకలు పూర్తిగా విరిగిపోవడంతో కూడలిలో గుమ్మంగా ఏర్పడటంతో వాహనదారులు వచ్చి ఆ గుంతలోనే పడిపోతున్నారు. కూడలి కావడం, నిత్యం జనసంచారం ఉండడంతో అక్కడకి వచ్చే ప్రతి వాహనదారులు నెమ్మదిగా వస్తుంటారు. దీని కారణంగా పెద్ద ప్రమాదం భారినుంచి బయట పడుతున్నారు. రాత్రి సమయంలో మాత్రం గుంత కనిపించకపోవడం, జనసంచారం లేకపోవడంతో వాహనదారులు ఆ మార్గం గుండా వస్తు ఆ గుంతలో పడిపోయి గాయాల పాలవుతున్నారు. ఇటీవల కొన్ని కార్ల చక్రాలు ఆ గుంతలోనే చిక్కుకున్న సందర్భాలు ఉన్నాయి. నడుస్తూ వెళ్లే వాళ్ల కాళ్లు ఆ గుంత ఇనుప సందుల్లో చిక్కుకొని పలువురు గాయపడ్డారు. జాతీయరహదారి ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి గుంతలు లేకుండా రోడ్డుకి మరమ్మతులు చేపట్టాలని ప్రమాదకరంగా ఉన్న గుంతకు మరమ్మతులు చేపట్టి వాహనదారులు, పాదచారులు ప్రమాదం బారిన పడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

సుభద్రాపురం కూడలిలో ప్రమాదకరంగా ఉన్న గుంత

పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అశోక్

టిడిపిలో పలువురు చేరిక

కవిటి: టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని, దాన్ని ప్రజలు గుర్తించారని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని బి.జి.పుట్టుగకు చెందిన గొనప సంతోష్ తన అనుచరులతో కలిసి ఆదివారం టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే వీరికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ టిడిపి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే అశోక్ పాలనదక్షతకు ఆకర్షితుడినై పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బెందాళం రమేష్, ఆరంగి మధు, శమల్ల సర్వేశ్వరరావు, బెందాళం కృష్ణారావు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న దొర

మొక్కలతోనే మానవాళి మనుగడ

ప్రజాశక్తి- పలాస

మానవాళి మనుగడకు మొక్కలు పెంచాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హెచ్.వి.దొర అన్నారు. మండలంలోని కొత్తపురంలో పైల తిరుమలరావు పెరడతోటలో ఆదివారం క్లీన్ అండ్ గ్రీన్ పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని, అందుకు ప్రతివ్యక్తి మొక్కలు పెంచాలని సూచించారు. సుమారు 110 మొక్కలు నాటామని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి తమ్మినాన మాధవరావు, కోశాధికారి నెమలిపురి అప్పారావు, పైల తిరుపతిరావు, తెప్పల కృష్ణమూర్తి, బాడ కోదండరావు, టెక్కలి ట్రెజరీ ఆఫీసర్ పేరాడ మన్మథరావు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

పలాసలో అన్నదానం

ప్రజాశక్తి- పలాస

మున్సిపాలిటీ షిరిడీ సాయి మందిరంలో దసరా సందర్భంగా ఆదివారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఆలయ ధర్మకర్త దువ్వాడ శ్రీధర్ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి పలాస కాశీబుగ్గ జంట పట్టణాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో ఆర్.శంకర్, దువ్వాడ అన్నాజీ, వి.శ్రీనివాస్, సుబ్బిరెడ్డి, వి.భీమారావు, కొంచాడ మన్మథరావు, డాక్టర్ కృష్ణ, దువ్వాడ నవీన్ చౌదరి, కూన హేమచలం, సాయి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.